తెలంగాణ ప్రజావారధి

ప్రతి అడుగు నిజం వైపు

www.telanganaprajavaradhi.com

తెలుగు దినపత్రిక



హైదరాబాద్ ఆదివారం 15 - 11 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 2

మల్లన్న..నీ అధికారం కోసం

కులాల మధ్య కొట్లాటలెందుకు..?

మోత్కూరు మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి



- రాజకీయాలు ఎన్నికలప్పుడే చేయాలి
- మీ పార్టీ విధి విధానాలేమిటో ప్రజలకు చెప్పు
- ప్రజల మధ్య చిచ్చు పెట్టడమే మీ పార్టీ సిద్ధాంతమా..?
- రెడ్లను తిట్టే పార్టీగా మారిన టీఆర్పీ
- అనాజిపురం ప్రమాద బాధితులను పరామర్శించలేదెందుకు..?

ప్రజావారధి/మోత్కూరు

తెలంగాణలో కులమతాలకతీతంగా కలిసిమెలిసి ఉండే ప్రజల మధ్య నీ అధికారం కోసం కులాల మధ్య కొట్లాటలు పెట్టవద్దని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి ఎమ్మెల్సీ, టీఆర్పీ రాష్ట్ర అధ్యక్షుడు తీన్మార్ మల్లన్నను కోరారు. శనివారం మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో రాజకీయాలు చేయాలి తప్ప వ్యక్తిగత స్వలాభం కోసం, అధికార దాహంతో కులాల మధ్య కొట్లాట పెట్టి ప్రజల్లో విద్వేషాలు పెంచడం దేనికని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ మల్లన్న తన తెలంగాణ రాజ్యాధికార పార్టీ విధి విధానాలేమిటో, తెలంగాణ ప్రజల కోసం, రైతుల కోసం ఏం చేస్తారో చెప్పకుండా రెడ్లను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని, టీఆర్పీ కాస్తా రెడ్లను తిట్టే పార్టీగా మారిందన్నారు. ప్రస్తుత కాలంలో అన్ని వర్గాల ప్రజలు చైతన్యవంతులయ్యారని, అన్ని కులాల్లో మంచి వారు, చెడ్డవారు ఉంటారని, దాన్ని గుర్తించి మాట్లాడకుండా ఒక కులాన్ని టార్గెట్ చేస్తూ మాట్లాడటం సరైంది కాదని, ప్రజలను ఏమార్చి రాజకీయం చేయాలనుకుంటే అది వారి భ్రమేనన్నారు. అధికారం కోసం కులాల మధ్య కొట్లాటలు, చిచ్చు పెట్టడం రాజ్యాధికారమా అని ప్రశ్నించారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో రెడ్ల పాత్ర గురించి తెలుసుకుని మాట్లాడాలని, ఆ పోరాటంలో వీరోచితంగా పోరాడి అమరులైన దొడ్డి కొమురయ్య, చాకలి అయిలమ్మ లాంటి మహాను భావులను తాము గౌరవిస్తామని, ఎమ్మెల్సీ మల్లన్న కూడా తన తీరు మార్చుకోవాలని సూచించారు. మల్లన్న పాదయాత్ర లో అనాజిపురం వద్ద అనుకోకుండా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కుటుంబం చిన్నాభిన్నమైందని, మరికొందరు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని, కనీసం మానవత్వంతో ఎమ్మెల్సీ మల్లన్న ఆస్పత్రికి వెళ్లి ఆ కుటుంబాలను పరామర్శించి ఎందుకు ఓదార్చ లేదని ప్రశ్నించారు. హుటా హుటినా హైదరాబాద్ వెళ్లి డీజీపీని కలిసిన మీరు పక్కనే 30కిలోమీటర్ల దూరంలో ఉన్న బాధితులను పరామర్శించరా అని, వారంతా బీసీలేనని, నీకు రాజ్యాధికారం ఇస్తే బీసీలకు ఏం న్యాయం చేస్తావో చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ మల్లన్నపై నిజంగానే కుట్రపూరితంగా హత్యా ప్రయత్నం జరిగితే దాన్ని తీవ్రంగా ఖండిస్తామన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



అయ్యో బిడ్డా..

ఆరేళ్ల పాప..వారం రోజులుగా ఒంటరిగా అడవిలో

యాదాద్రి జిల్లా అడ్డగూడూరు మండలం ఆజీంపేట గ్రామంలో ఘటన



- బాతుల వద్ద జీతం పెట్టిన ఆంధ్రాకు చెందిన తల్లిదండ్రులు..?
- బాతులతో కలిసి ఒంటరిగా అడవిలోనే నిద్ర
- రాత్రి గ్రామస్తుల కంటపడిన చిన్నారి
- సర్పంచ్ సంరక్షణలో బాలిక..పోలీసులకు సమాచారం

ప్రజావారధి/మోత్కూరు

ఆరేళ్ల ఆడ బిడ్డ.. చదువుకోవాల్సిన వయసులో బాతులకు కాపలాగా జీతం పెట్టారు. పోనీ ఆ బిడ్డ వెంట మరొకరు తోడు ఉన్నారంటే అదీ లేదు. ఆ పసి బిడ్డ ఒక్కతే రాత్రిపగలు బాతులతోనే ఉంటూ..రాత్రివేళ ఎముకలు కొరికే చలిలో ఆ అడవిలోనే నిద్రపోతున్నది. కాళ్లకు చెప్పులు లేక కాళ్లు పగిలి రక్తం కారుతున్నాయి. చలికి చర్మం మొత్తం పగిలిపోయి, దోమలు కరిచి, పురుగులు ఒంటిపై పారడంతో ఒళ్లంతా దద్దుర్లు వచ్చాయి. ఐదారు రోజులుగా బాతులతో కలిసి అటవీ ప్రాంతంలోనే ఉంటున్న ఆ చిన్నారి చివరకు గ్రామస్తుల కంటపడింది. ఈ హృదయవిదారక ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం ఆజింపేట గ్రామంలో వెలుగుచూసింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం...ఆజీంపేట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో మూసీ నది వెంట శనివారం రాత్రి ఆరేళ్ల బాలిక ఒంటరిగా కనిపించడంతో గ్రామస్తులు ఆమెను చేరదీశారు. చిన్నారిని గ్రామంలోకి తీసుకవచ్చి సర్పంచ్ లింగస్వామికి అప్పగించారు. ఆకలితో ఉన్న బిడ్డకు అన్నం పెట్టి ఆకలి తీర్చారు. ఆ బిడ్డను వివరాలు అడగగా.. తనది ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలు జిల్లా కందుకూరు అని చెప్పినట్లు తెలిసింది. తల్లిదండ్రులు తనను బాతుల వద్ద నెలకు రూ.5 వేల జీతానికి పనికి పెట్టినట్లు బాలిక తెలిపినట్లు సమాచారం. దీపావళి పండుగ తర్వాత ఇక్కడకు తీసుకవచ్చారని, అప్పటి నుంచి బాతులతో కలిసి అడవిలోనే ఉంటూ, అక్కడే నిద్రిస్తున్నట్లు చిన్నారి చెప్పినట్లు తెలుస్తోంది. ఓ వ్యక్తి మధ్యాహ్నం వేళ వచ్చి అన్నం, నీళ్లు ఇచ్చి వెళతాడని చెబుతోంది. ఇంత చిన్న వయసులో తల్లిదండ్రులు అడవిలో బాతుల వద్ద ఒంటరిగా జీతానికి పెట్టడానికి వారికి మనస్సు ఎలా వచ్చిందని, ఆ బిడ్డ పరిస్థితిని చూసి గ్రామస్తులు కంటనీరు పెట్టారు. ప్రస్తుతం చిన్నారి ఆజింపేట గ్రామ సర్పంచ్ సంరక్షణలో ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన స్థానిక పోలీసులకు బాలిక సమాచారం అందించినట్టు తెలిసింది. బాలిక తల్లిదండ్రులు ఎక్కడున్నారు? ఆమెను బాతుల వద్దకు ఎవరు తీసుకొచ్చారు? అన్నది తెలియాల్సి ఉంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చిన్నారికి రక్షణ కల్పించడంతో పాటు తల్లిదండ్రుల ఆచూకీ గుర్తించి ఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.